# మళ్ళీ మళ్ళీ చెప్పుకునే కథ



ఎదురుగా పాలరాతి శిల్పం.

ఎత్తు తలపాగాలవారు, నిలువెత్తు బల్లాలవారు మందీ మార్బలంతో యుద్ధ సన్నద్ధులై ఉన్నారు. మరోప్రక్క ఎర్రటి కిరీటాలతో అపార సైన్యంతో కత్తులు ఝళిపిస్తున్న రాజులు, రారాజులు.

అందరూ ఈ క్షణంలోనో మరోక్షణంలోనో రంగంలోకి దూకేట్లు ఉన్నారు. ఈ కసి, ఈ పగ, ఈ కావేషం అంతా బుద్ధభగవానుని అస్తికలకోసం. ఆ పవిత్రావశేషాలు తమవే కావాలన్న తపనకొద్దీ ......

ఇంతకు ముందు.

బుద్ధుడి చివరిదశ. శిష్యులతో పావానగరం చేరుకున్నాడు. అక్కడ చందుడనే భక్తుడు స్వామికి కన్నీళ్ళతో కాళ్ళు కడిగి తన ఇంట భిక్ష ఆరగించమని వేడుకున్నాడు. సరేనన్న బుద్ధుడికి చందుడు సంబరంతో స్వయంగా తయారుచేసిన పందిమాంసం వడ్డించాడు. శిష్యులు తెల్లబోయి "అదేమని" అడగబోతే బుద్ధుడు చిరునవ్వుతో వారించాడు. "భక్తితో పెట్టింది భోజనీయము. ప్రేమతో పెట్టింది పరమాన్నమూ ... ఏ పదార్థమైతే నేమి?" అంటూ ఆ మాంసాన్ని

ఆరగించాడు. చందుడు జన్మ తరించిందన్నట్టు స్వామికి సాగిలబడి, బుద్ధుడు వెళ్ళిపోయాక మట్టిలో నిలిచిపోయిన స్వామి అడుగుల గుర్తుల్ని పదేపదే ముద్దాడి ఆ దుమ్ములో పొర్లాడాడు.

చందుడి ఆనందమే బుద్ధుడికి ఆనందం. కాని బుద్ధుడి శరీరం క్షీణిస్తోంది. బుద్ధుడు నడవలేకపోతున్నాడు. కుశీ నగరం అల్లంతదూరాన ఉండగా ఓ తోట కన్పించింది. ఆ తోటలో జంట చెట్లు ఉన్నాయి. ఆ జంట చెట్ల కొమ్మలకింద ఉత్తరదిశగా కాషాయవస్త్రం పరుచుకుని బుద్ధుడు పడుకున్నాడు. శిష్యులు తల్లడిల్లి పోతున్నారు. స్వామి మాట్లాడటం లేదు. ప్రేమ ప్రవచనం లేదు. కన్నీరు మున్నీరై గోలుగోలున ఏడుస్తున్నారు. బుద్ధుడి శరీరంలో జవం క్షీణిస్తోంది కాని కళ్ళు వెలుగుతూనే ఉన్నాయి. పెదవులపై చిరునవ్వు చెదరటం లేదు.

శిష్యులు స్వామికి కలిగిన ఆపద చెప్పుకోటానికి దేశం నలుమూలలకీ వెళ్ళారు. మిగిలినవారు ఆ వనంలో ఉన్న చెట్లకీ, పుట్టలకీ, ఆకులకీ, పువ్వులకీ, వెన్నెలకీ, నక్షత్రాలకీ చెప్పుకుని గుండెలు బాదుకున్నారు. బుద్ధుడి స్థితిలో మార్పు లేదు.

దేశం నాలుగు చెరగులనించీ భగవానుణ్ణి ఆఖరుసారి దర్శించుకుందామని పసిపిల్ల జనం బాలాది తండోపతండాలుగా వచ్చారు. తోట నిండిపోయింది. అంగుళం ఖాళీలేదు, అందరి ముఖాల్లో దైన్యం, అందరి కళ్ళలో అశ్రువులు. కన్నీటి సంద్రం కదులుతున్నట్టుంది.

"పలుకు స్వామీ! పలుకు! నీ ప్రవచనాలతో మా గుండెలో ప్రేమ నింపావే! నీ పలకరింపుతో మమ్మల్ని బుజ్జగించి నీలో కలుపుకున్నావే! నీ కంటి వెలుగుతో మా గుండె చీకట్లు చీల్చివేశావే! ఒక్కసారి ....... ఒక్కసారి అమృతమయంగా పలుకు తండ్రీ! ఒక్కసారి నీ ప్రేమ వాక్కులతో మమ్మల్ని లాలించు తండ్రీ!" అంటూ మూగగా మొరపెట్టుకుంటున్నాయి కొన్ని లక్షల గుండెలు.

బుద్ధుడి గొంతు విడలేదు. శరీరం స్వాధీనం కాలేదు. స్వామి కళ్ళవెలుగు ఆ బిక్కవోయిన లక్షలాది కన్నీటి ముఖాలని తాకుతోంది. స్వామి చిరునవ్వు వెన్నెల ఆ చిన్నవోయిన గుండెల్ని ఓదార్పుగా నిమురుతోంది. వైశాఖ పూర్ణిమనాడు,

లోకమంతా వెన్నెల పరుచుకున్ననాడు. తాను జన్మించి జగత్తుకు వెలుగైననాడు ఆ వెన్నెల వెల్లువలో కలిసిపోయినాడు బుద్ధుడు.

వెన్నెల చీకటైంది. బుద్ధుడులేని లోకం భయంకరంగా ఉంది. చెట్లు విలవిల్లాడుతూ ఏడుస్తున్నాయి. మొగ్గలు పువ్వులవకుండానే వాడిపోయాయి.

జనం కళ్ళలో కన్నీళ్ళు ఇంకిపోయాయి.

బుద్ధుడి మహాపరినిర్వాణ వార్త సర్వులకూ తెలిసిపోయింది. ఆటవికులు, రాజులు, రారాజులు అంతా విచ్చేశారు. ఆ జగత్ప్రభువుకు అంత్యక్రియలు జరిపించారు.ఆ పవిత్రాస్థికలు మాకు కావాలంటే మాకు కావాలన్నారు. ఆ అస్థికలకోసం ప్రాణాలు పణంగా పెడ్తామన్నారు. రాజ్యాలు ధారపోస్తామన్నారు. వాదులాట పెరిగింది. వాదు తెగలేదు. కత్తులు దూశారు. బల్లాలు ఎగరేశారు. వీరాలు పోయారు. యుద్ధానికి దిగి బలాబలాలు తేల్చుకుందామనుకున్నారు.

"రె ... రె..... రె.... రెరెరె"

హా ..... హా...... హా....... హాహాహా!

నెత్తురు నేల చిమ్మింది. రెండుపక్కలా పొంగివున్న సైన్యాలు, మెరుస్తున్న కత్తులు .....

తలలు తెగి నేలపడకముందే వొళ్ళు తెలిసింది. చల్లబడ్డారు. ఏ రక్తపాతం కూడదని, ఏ హింస పనికిరాదని ప్రవచించి మనందర్నీ మనుషుల్ని చేసిన ఆ స్వామి గుర్తుగా రక్తపాతమా? తిరిగి హింసా?

వొద్దు వొద్దనుకున్నారు.

తప్పు, తప్పనుకున్నారు.

చిరునవ్వులు నవ్వుకున్నారు. పరస్పరం కౌగలించుకున్నారు. స్వామి పవిత్రాస్థికల్ని సమానంగా పంచుకున్నారు. భక్తితో వారి వారి దేశాలకు తీసుకెళ్ళారు.

ఆ అస్థికలపైన స్థూపాలు కట్టారు. ఆ స్థూపాలపైన శిల్పాలు చెక్కారు, ఆ శిల్పాలపైన ఈ కథనే, తమ కథనే చిత్రించారు.*